క్లుప్తంగా

ముగ్గురికి సీఐ, ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం: సమర్థంగా విధులు నిర్వర్తించి, ప్రజల్లో పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ సూచించారు. పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నాగకుమారి సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. 2009 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆమె గతంలో మహిళా పీఎస్, నల్లపాడు పీఎస్, గుంటూరు ట్రాఫిక్ పీఎస్‌లో విధులు నిర్వర్తించారు. అరండల్‌పేట పీఎస్ ఏఎస్ఐ నరేంద్రకుమార్‌తో పాటు బాపట్ల జిల్లా నుంచి జిల్లాకు బదిలీ అయిన ఏఎస్ఐ మైలా బ్రహ్మయ్య ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ క్రమంలో శుక్రవారం సీఐ నాగకుమారితో పాటు ఇద్దరు ఎస్ఐలు జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ఎస్పీ తుషార్‌డూడీని మర్యాద పూర్వకంగా కలిసి, పూల బొకేలు, మొక్కలు అందించారు.

డీసీపీపై బిల్డర్ల దౌర్జన్యం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ డెప్యూటీ సిటీ ప్లానర్ మహాపాత్రోపై బిల్డర్లు దౌర్జన్యానికి దిగారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కమిషనర్ కీర్తి చేకూరిని కలిసేందుకు బిల్డర్లంతా నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. ముందుగా సిటీప్లానర్ ప్రదీప్ కుమార్‌ను చాంబర్‌లో కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆ తరువాత అక్కడికి వచ్చిన డీసీపీ మహాపాత్రోను చూసి బిల్డర్లు ఊగిపోయారు. 'నువ్వు వచ్చిన దగ్గర నుంచే మాకు ఇబ్బందులు తలెత్తా'యంటూ ఆయనపై దౌర్జన్యానికి దిగారు. నిబంధనలు మేరకే విధులు నిర్వహించినట్లు డీసీపీ తెలిపారు. అనంతరం చాంబర్‌లో కమిషనర్‌తో భేటీ అయ్యారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బిల్డర్లకు ఆమె భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఆలయంలో చోరీ

పట్నంబజారు: ఆలయంలో చోరీ ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటలోని చిన్నమ హోలక్ష్మిమ్మ ఆలయానికి ఈనెల 12వ తేదీ రాత్రి అర్చకులు ఎప్పటిలాగే తాళాలు వేసి వెళ్లిపోయారు. తిరిగి 13వ తేదీ ఉదయం వచ్చి చూసేసరికి పగులగొట్టి ఉండటం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా హుండీలో రూ. 25వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల రామ్మోహన్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాం ఫాంలో మిరప విత్తనాల విక్రయం



పెదకాకాని: ఉద్యాన పరిశోధన స్థానం లాం ఫాంలో ఎల్‌సీఏ 625, 643 రకాల మిరప విత్తనాలు విక్రయించనున్నట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.గిరిధర్ తెలిపారు. ఆయా రకాల మిరప ప్రయోజనాలను శుక్రవారం ఆయన వివరించారు. ఎల్‌సీఏ 643 రకం కాయలు బాగా పొడవుగా, లావుగా, అధిక ఘాటు, రంగు కలిగి..ఎండిన కాయలు బాడిగ రకంలా ముడతలు కలిగి ఉంటుందని తెలిపారు. ఈ రకం పచ్చి, ఎండు మిరపగా అనువైన రకమని పేర్కొన్నారు. అలానే ఎల్‌సీఏ 625 రకం మిరప కాయలు మధ్యస్థ పొడవుతో సన్నగా ఉండి, అధిక ఘాటుతో మంచి రంగును కలిగి ఉంటాయని వివరించారు. కోత ఆలస్యమైనా, నిల్వ ఉన్నా రెండు రెండు నెలలు రంగును కోల్పోకుండా ఉంటుందని వివరించారు. వెద పద్ధతిలో నాటుకోవటానికి మిక్కిలి అనుకూలమైన రకమన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు నేరుగా ఉద్యాన పరిశోధన స్థానం, లాం ఫాంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల లోపు విత్తనం లభ్యత ఉన్నంత వరకు పొందవచ్చని చెప్పారు. కిలో విత్తనం ధర రూ.1,200లుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. మిరప విత్తనాలు కేవలం ఉద్యాన పరిశోధన స్థానం, లాం ఫాం నందు మాత్రమే పొందాలని, అవే పేర్లతో బయట ఎవరైనా ఈ విత్తనాలు అమ్మినట్లయితే రైతులు వాటిని కొనుగోలు చేసి, మోసపోవద్దని శాస్త్రవేత్త డాక్టర్ కె.గిరిధర్ స్పష్టం చేశారు. వివరాలకు 99898 09554, 73826 33661 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నాటిక రచనల పోటీలు

తెనాలి : గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో అమ్మ ఇతివృత్తంతో గోవాడ మల్లీశ్వరి స్మారక నాటిక రచనల పోటీలను నిర్వహిస్తున్నట్టు శుక్రవారం తెనాలిలో ఒక ప్రకటనలో తెలిపారు. నాటికలు ప్రయోగాత్మక/ ప్రతీకాత్మక ప్రదర్శనకు అనువుగా, 45 – 60 నిమిషాల నడుమ ఉండాలని సూచించారు. రచనల మూడు ప్రతులను 30వ తేదీలోగా వెంకట్ గోవాడ, గోవాడ క్రియేషన్ 5–1–44, శ్రీవీరాంజనేయ కాలనీ, సాహెబ్‌నగర్, వనస్థలిపురం, హైదరాబాద్–500070 అనే చిరునామాకు పంపాలని కోరారు.

కేక్ కట్ చేసిన న్యాయవాదులు

తెనాలి రూరల్: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో సంతకం చేయడంపై తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కేక్ కట్ చేశారు. కొత్తపేటలోని కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు తాడి బోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, అనిత, గాదెలవర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార జంతు వధ నిషేధం

- డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్
- బక్రీద్‌ను సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలి



ముస్లిం మత పెద్దలు, గో సంరక్షణ సభ్యులు, అధికారులతో సమావేశమైన డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

నెహ్రూనగర్: నగరంలో బక్రీద్‌ను సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాస్ సూచించారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 17న జరగబోయే బక్రీద్ పండుగ నిర్వహణపై ముస్లిం మత పెద్దలు, గో సంరక్షణ సమితి సభ్యులు, పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, , నగరపాలక సంస్థకు ముస్లిం మత పెద్దలు సహకరించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అనధికార జంతు వధ నిషేధమని, నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన జంతు వధశాలను వినియోగించుకోవాలని తెలిపారు. న్నారు. 1977 ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధం, పశు సంరక్షణ చట్టం సెక్షన్ 5 ప్రకారం రాష్ట్రంలో ఆవు, దూడలు, గేదెలను ఎట్టి పరిస్థితిల్లోనూ వధించరాదని స్పష్టం చేశారు. మసీదుల్లో మత పెద్దలు గోవధ నిషేధం, పండుగ నిర్వహణపై సూచనలు చేయాలని ఆయన కోరారు. నగర పరిధిలో ప్రజారోగ్య అధికారులు, ఇతర శాఖల అధికారులతో నాలుగు బృందాల్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ఎక్కడైనా గోవధ జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే కంట్రోల్ రూం 98499 08391 లేదా 0863–2345103 నంబర్లకు కాల్ చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు వెంకట కృష్ణయ్య, వెంకటలక్ష్మి, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్‌ఓ(ఎఫ్‌ఏసీ) మధుసూదన్, ఎస్‌ఎస్‌లు, గోసంరక్షణ సమితి సభ్యులు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలకు విశేష స్పందన



రక్తదాతలతో డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, కళాశాల్లో జీజీహెచ్ రక్త నిధి విభాగం ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, కళాశాలలో 190 యూనిట్లు, మెడికల్ కళాశాలలో 85 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు చెప్పారు. ఒకేరోజు రెండు చోట్ల శిబిరాలే ఏర్పాటు చేసి విద్యార్థుల నుంచి రక్తం సేకరించారని తెలిపారు. మెడికల్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తం దానం చేయడం అభినందనీయమన్నారు. మెడికల్ కళాశాల విద్యార్థులు ఇదే ఆసుపత్రికి రక్తం ఇవ్వడం వల్ల పేద రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.టి.కె రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సింధూర రాణి, డాక్టర్ రాధిక, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో స్వామి

నగరంపాలెం: కొత్తపేట(పశువుల ఆసుపత్రి ఎదురు)లోని శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు అర్చకులు స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలకరించారు. ఉత్సవ మూర్తుల్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణ, విశ్వేశ్వర పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపారాధన, నవకుంభారోపణ కార్యక్రమాలు చేపట్టారు. లాలాపేట శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపేట శ్రీజగన్నాథస్వామి దేవస్థానం, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, ఈఓ డి.శ్రీనివాసరావు, దేవస్థానం అర్చకులు శ్రీ అయోధ్య అయ్యప్ప, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే బి.రామాంజనేయులు



స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం మంజూరు చేసిన స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన గుణాత్మక విద్య అందిస్తున్నట్లు చెప్పారు. తాను చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక ఉద్యోగాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గంలో ప్రతి ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ప్రగతి వివరాలను పరిశీలించడంతో పాటు వారి తల్లిదండ్రులతో చర్చించనున్నట్లు ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. తొలుత పాఠశాల స్థల దాత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, నల్లమోతు పూర్ణయ్య, మామిళ్లపల్లి రామ్‌గోపాల్, నువ్వుల సునీల్ చౌదరి, కొల్లా వీరయ్య చౌదరి, నక్కల అగస్టీన్, తహసీల్దారు పార్వతీ, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓలు కేఏఫ్ కెనడీ, విజయ్ భాస్కర్, వివిధ పాఠశాల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

ఆర్టీవో ప్రసాద్



స్కూల్ బస్సు పత్రాలను పరిశీలిస్తున్న రవాణా అధికారులు

తెనాలి రూరల్: పాఠశాల, కళాశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని ప్రాంతీయ రవాణా అధికారి కె. ప్రసాద్ స్పష్టం చేశారు. తెనాలిలో విద్యాసంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ విద్యా సంస్థల బస్సులు కచ్చితంగా 32 నిబంధనలు పాటిస్తూ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని వెల్లడించారు. పాఠశాల బస్సు డ్రైవర్ 60 సంవత్సరాలు దాటిన వ్యక్తి అయితే అనర్హుడని పేర్కొన్నారు. డ్రైవర్ ప్రతి మూడు నెలలకొకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆ రికార్డులు భద్రపరచాలని వివరించారు. డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీవో అధికారులకు తెలియజేయడంతోపాటు, ఐదేళ్ల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి నెలా వాహనానికి సంబంధించి స్థితిగతులను నమోదు చేయాలని తెలిపారు. బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరచుకునే బాక్స్‌లు తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా వాహనాలను సరైన కండీషన్‌లో ఉంచుకుని రూల్ 185(జీ) నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి కార్యాలయ పరిధిలో 370 విద్యాసంస్థల బస్సులు ఉండగా, ఇప్పటి వరకు 325 కి సామర్థ్య పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసినట్టు తెలిపారు. ఆర్టీవోతో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారు నగల చోరీ

తెనాలి రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు కథనం మేరకు.. పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన గుంటూరు శ్యాంబాబు కుటుంబ సభ్యులతో విజయవాడలోని కుమార్తె వద్దకు ఈ నెల 11వ తేదీన వెళ్లారు. మరుసటి రోజు తెనాలి వచ్చి చూడగా ఇంట్లోని బీరువా తాళం తెరచి ఉంది. అందులో ఉంచిన సుమారు రూ. లక్ష విలువ చేసే బంగారు గొలుసులను దుండగులు చోరీ చేశారు. బాధితుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించగా, టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు కాల్వల్లో పూడికను తక్షణం తొలగించాలి



నగరంపాలెం: రోజు వారీ పర్యటనలో భాగంగా శుక్రవారం 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ శ్రీనివాసరావుపేటలోని నాలుగైదు వీధుల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మురుగు కాల్వల్లో పూడికను పరిశీలించారు. సమస్యను మున్సిపల్ డీఈ రమేష్‌బాబు దృష్టికి తీసుకొచ్చారు. రానున్న వర్షకాలం దృష్ట్యా పూడికను త్వరితగతిన తొలగించాలని ఆయన్ను కోరారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వీధి కుక్కల నియంత్రణకు కు.ని. ఆపరేషన్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు యాంటీ రేబిస్ టీకాలు వేయించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి నగర ప్రజలతో పాటు జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. జాతీయ జంతు సంక్షేమ సంఘం, హరియాణా రాష్ట్ర గుర్తింపు పొందిన స్నేహ వెల్ఫేర్ సొసైటీ టెండర్ల ద్వారా గుంటూరు నగర, పంచాయతీల పరిధిలోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణతో పాటు యాంటీ రేబిస్ టీకాలు వేయడానికి ఒప్పందంతో పాటు అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ అధికారుల కమిటీ పర్యవేక్షణలో నిర్దేశిత నిబంధనల మేరకు ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ సెంటర్‌లో నిపుణులైన పశువైద్యులు కుక్కలకు ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. వైద్యం, ఆహారం అందించి కోలుకున్న నాలుగు రోజుల తరువాత మళ్లీ యథాస్థానంలో విడిచి పెడతామని వివరించారు. జీఎంసీకి చెందిన నిపుణులైన సిబ్బంది వాహనంతో వచ్చినప్పుడు వీధి కుక్కలను పట్టించడంలో సహకరించాలని ఆమె నగర ప్రజల్ని కోరారు.

19 నుంచి శ్రీదత్తసాయి ప్రేమ మందిరం వార్షికోత్సవాలు

తెనాలి : దుగ్గిరాల మండలంలోని ఈమనిలో శ్రీదత్తసాయి ప్రేమమందిరం 18వ ప్రతిష్ట వార్షికోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి జరగనున్నాయి. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాలను తొలిరోజు ఉదయం ఆరు గంటలకు పతాకావిష్కరణతో ప్రారంభిస్తారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదాయ భజనలు చేస్తారు. రెండోరోజైన 20న ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీసాయి సచ్చరిత్ర సామూహిక పారాయణం ఉంటుంది. తెనాలి మారీస్‌పేటలోని శ్రీసాయి సన్నిధి నిర్వాహకులు హెచ్‌ఆర్ లక్కరాజు నిర్వహిస్తారు. చివరిరోజైన 21న శ్రీసాయిబాబాకు విశేష అభిషేకాలు, అనంతరం శ్రీసాయి మంత్ర జప తర్పణ హోమాలు, మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ జరుగుతుందని తెలిపారు. అదేరోజు రాత్రి 8.30 గంటల నుంచి శ్రీమహానందీశ్వర నాట్యమండలి–తెనాలి వారి గయోపాఖ్యానం నాటకంలో యుద్ధఘట్టం, సత్యహరిశ్చంద్రీయం నాటకంలో కాటి సీను ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ఈమనిలోని శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్యసేవా కేంద్రం, అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ వేడుకలను నిర్వహిస్తారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి



తెనాలి అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ బి.ప్రసన్న పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. సత్యం, శివం, సుందరం, సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, షేక్ షఫీ, మాలేపాటి హేమ్‌కుమార్ తదితరులు రక్తదానం చేశారు. వారిని ప్రసన్న అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు వైద్యులు డాక్టర్ సందీప్, సిబ్బంది ఎం.బాపనయ్య, రమాదేవి, అపర్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాల్వల పూడికతీత పనులు

- పట్టణంలో ఎనిమిది ప్రధాన కాల్వల మరమ్మతులకు చర్యలు
- భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న ప్రణాళికలు
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



కాల్వలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలోని ప్రధాన పంట, మురుగు కాల్వల పూడికతీత పనులు ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రధాన కాల్వల పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత స్థానికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెనాలి పట్టణంలో 47 కిలోమీటర్ల మేర 8 ప్రధాన కాల్వలను బాగు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించినట్లు చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొదటి విడత కింద ప్రధాన కాల్వల పూడికతీత పనులు చేపట్టామన్నారు. తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల వ్యర్థాలను ప్రధాన కాల్వల్లో ఇప్పటి వరకు వేయడం జరిగిందన్నారు. దీనివలన కాల్వల్లో చెత్త పేరుకుపోయి పారుదలకు అవరోధంగా మారినట్లు తెలిపారు. కాల్వల్లో ఉన్న వ్యర్థాలను తొలగించడంతోపాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో తెనాలి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చేలా కృషి చేస్తామన్నారు. తెనాలి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాల్వలపై ఆక్రమణలు ఎక్కువగా జరిగినట్లు గుర్తించామని తెలిపారు. వాటన్నింటిని తొలగించేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కాల్వల చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా చూస్తామన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నం పిన్నారావు, దివి అనిత, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మలికార్జునరావు, అధికారులు, జనసేన నాయకులు హరిదాసు గౌరిశంకర్, దొడ్డక ఆదినారాయణ, షేక్ జాకీర్, గుణ, బండారు రవికాంత్, సెట్టిపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సాయి, టీడీపీ నాయకులు కోగంటి శివశంకరరావు, బొల్లినేని బుజ్జి, మంగమూరి యుగంధర్, మహ్మద్ ఇస్మాయేల్ బేగ్, పసుపులేటి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ మధుసూదన్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు వార్డు సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు కృషి చేయాలని ఎంహెచ్‌ఓ మధుసూదన్ తెలియజేశారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నగరంలోని శానిటేషన్ కార్యదర్శులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల మేరకు నగరాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగంపై ప్రతి శానిటేషన్ కార్యదర్శి అంచనా, అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తమ పరిధిలో ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల్లో ప్లాస్టిక్, బ్యాన్ చేసిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అంచనా చేయాలని సూచించారు. ఏ ప్రాంతంలో ఎక్కువగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం జరుగుతుందో గుర్తించి, వాటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నారాయణ, జీఎంసీ ఎస్‌ఎస్‌లు ఆనంద కుమార్, రాంబాబు, ఆయూబ్‌ఖాన్, సోమ శేఖర్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌తో నాణ్యత, మన్నిక



మేస్త్రీకి బీమా బాండ్ అందజేస్తున్న సురేష్, భవానీశంకర్, గాంధీకుమార్

నెహ్రూనగర్: శాశ్వత భవన నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేసిన నాణ్యమైన భారతి సిమెంటును ఎంచుకోవాలని అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్. భవానీశంకర్ సూచించారు. నగరాలులోని సాయి ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంటు తయారవుతుందని తెలిపారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడతుందని చెప్పారు. సిమెంటు తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని చెప్పారు. టెక్నికల్ ఆఫీసర్ భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంటుతో కాంక్రీట్‌తో వేసిన శ్లాబుల్ని ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యత పరీక్షలు చేస్తారన్నారు. సిమెంటు నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తామని చెప్పారు. దీనికి డీలరు ద్వారా వివరాలు తెలుసుకుని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందని తెలిపారు. మేస్త్రీల సందేహాల్ని నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి, బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంటర్‌ప్రైజెస్ యాజమాని పి. గాంధీకుమార్, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

రాజధాని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి రామారావు

తాడేపల్లిరూరల్: రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలు వారి బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమ చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. శుక్రవారం ఉండవల్లిలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈమని రామారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాశం రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రధాని మోదీ రాజధాని అభివృద్ధికి నిధులు ఇస్తానని వాగ్దానం చేసి విస్మరించారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలుగుదేశం, జనసేన మిత్రపక్షంగా ఉన్న ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వాన్ని రాజధాని అభివృద్ధికి నిధులు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు కోరాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ మతోన్మాద అజెండాను ప్రజలు తిరస్కరించి ఆ పార్టీ మెజార్టీ స్థానాలను తగ్గించారన్నారు. దేశంలో మోదీ గ్రాఫ్ పడిపోయింది అనడానికి ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలిస్తామని మంగళగిరి ఎమ్మెల్యే లోకేష్ హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో నిర్మించిన టిడ్కో గృహాల నివాసితులకు బ్యాంకు అధికారులు బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాజధాని డివిజన్ సీపీఎం నాయకులు ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, సీహెచ్ సుందరరావు, ఎస్కే ఎర్రపీరు, గడ్డం కృష్ణ, నాగేశ్వరరావు, షేక్ గని, ఎం. ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.